సాక్షి
కాకినాడ
మంగళవారం । 24 । సెప్టెంబర్ । 2024



తెలుసుకుందాం.. తేరుకుందాం


గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్)ను ముందస్తుగా గుర్తించేందుకు జీజీహెచ్ బృందం అమెరికా డాక్టర్లతో కలసి ముందుకొచ్చింది. - 8లో



గొడౌన్‌లో బియ్యం చోరీ

రైస్ బ్యాగ్‌ల దొంగతనాలకు పాల్పడే ముగ్గురు ముఠా సభ్యులను సోమవారం అరెస్టు చేసినట్టు సర్పవరం సీఐ బి.పెద్దిరాజు తెలియజేశారు. - 8లో

సముద్రంలోకి 1.62 లక్షల క్యూసెక్కులు




ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం సాయంత్రం 1,62,276 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది. తూర్పు డెల్టాకు 4,700, మధ్య డెల్టాకు 2,500, పశ్చిమ డెల్టాకు 7 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు.

అనుకుల బదిలీలు

- దేవదాయ శాఖలో రూ.లక్షలు కురిపించిన ట్రాన్స్‌ఫర్లు
- చక్రం తిప్పిన ఇద్దరు ఉన్నతాధికారులు
- 'పవన్' ఇలాకాలో వింత పరిస్థితి
- అడ్‌హాక్ పదోన్నతులతో పోస్టింగ్‌లు



తలుపులమ్మ లోవ దేవస్థానం



వాడపల్లి వెంకన్న ఆలయం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: దేవదాయశాఖలో బదిలీలు పెద్ద తలకాయలకు కాసులు కురిపించాయి. రూపాయి, పాపాయి కాదు ఏకంగా రూ.లక్షలు కుమ్మరించి కోరుకున్న స్థానాలు ఎగరేసుకుపోయారు. బదిలీల్లో రాజకీయ నేతల సిఫారసులు, ధన ప్రవాహం, సామాజిక సమీకరణలు కీలకంగా పనిచేశాయి. ఆ శాఖలో ఇద్దరు ఉన్నత స్థాయి అధికారులు తమ, తమ సామాజికవర్గాలకు అధిక ఆదాయం వచ్చే ఆలయాల్లో ప్రాధాన్యం ఇచ్చారు. అలాగని వారికి ఏదో ఉదారంగా బదిలీలు చేశారనుకుంటే తప్పులో కాలేసినట్టే. కాసులు కురిపించే పోస్టింగ్‌ల విషయంలో ఎక్కడా రాజీ లేకుండానే ముక్కుపిండి మరీ మూట గట్టుకు పోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సామాజికవర్గాలకు చెందిన ఇద్దరు ఉన్నతాధికారులు ఈ మొత్తం బదిలీలు, పదోన్నతుల వ్యవహారాన్ని చక్కబెట్టారని దేవదాయశాఖ వర్గాల్లో విస్తృతమైన ప్రచారం జరుగుతోంది. కోరుకున్న స్థానాల్లో పోస్టింగ్‌లు ఇవ్వడం వెనుక రూ.లక్షలు చేతులు మారాయి. అడ్‌హాక్ డిప్యూటీ కమిషనర్ పదోన్నతుల కోసం రూ.అరకోటి పైనే రేటు పెట్టి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు జేబులు నింపుకున్నారు. పదోన్నతులతో పాటు లక్షల ఆదాయం కురిపించే ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో పోస్టింగ్‌ల కోసం ఇద్దరు, ముగ్గురు పోటీ పడటం కూడా ఆయా నియోజకవర్గాల నేతలు, ఉన్నతాధికారులకు కాసుల వర్షం కురిపించింది.

డబ్బు లిస్తే కోరుకున్న స్థానాలు

దేవదాయ శాఖలో సుమారు 50 మంది అసిస్టెంట్ కమిషనర్‌లు, డిప్యూటీ కమిషనర్‌ల బదిలీలు ఆదివారంతో ముగిశాయి. వీటిలో కొందరికి సీనియార్టీతో సంబంధం లేకుండా పదోన్నతులతో కూడిన బదిలీలు ఇచ్చారు. ఏ శాఖలో అయినా బదిలీల ప్రక్రియలో నిబంధనలతో పాటు అధికారి లేదా ఉద్యోగి పనితీరు ప్రామాణికంగా తీసుకోవడం సహజం. ఇందుకు పూర్తి భిన్నంగా దేవదాయశాఖలో బదిలీలు జరిగాయని ఉద్యోగ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా డిప్యూటీ కమిషనర్‌ల బదిలీల్లో ఇవేవీ పట్టించుకోకుండానే డబ్బు కుమ్మరించిన వారికే కోరుకున్న స్థానం ఇచ్చారనే చర్చ జరుగుతోంది.

ఆంతర్యమేమిటో..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి, లోవ తలుపులమ్మ దేవస్థానం, పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి, పంచారామ క్షేత్రాలైన ద్రాక్షారామ, సామర్లకోట భీమేశ్వరస్వామి, కాకినాడ బాలాత్రిపురసుందరి ఆలయాలు ప్రముఖ పుణ్యక్షేత్రాలుగా విరాజిల్లుతున్నాయి. వీటితో పాటు వందలాది ఎకరాలు కలిగిన కాకినాడ ఎంఎస్ఎన్ చారిటీస్‌కు భారీ డిమాండ్ నెలకొంది. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రతిష్టాత్మకమైన కాకినాడ బాలాత్రిపురసుందరి ఆలయానికి గ్రేడ్-1 ఈఓను నియమించాలి. ఇక్కడ ఉన్న గ్రేడ్-1 ఈఓ భాస్కర్‌రెడ్డిని చిన్న సంస్థ అయిన బంగారు చినశోభనాద్రి సత్రానికి బదిలీ చేశారు. ఈ ఆలయానికి గ్రేడ్-2 ఈఓను నియమించాల్సిన అవసరం ఏమొచ్చిందనే చర్చ ఆ శాఖలో జరుగుతోంది. కాకినాడ జిల్లాలోని తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఈఓ పి.విశ్వనాథరాజు మూడేళ్లుగా పనిచేస్తున్నారు. ఈ ఆలయానికి డిప్యూటీ కమిషనర్ హోదా కలిగిన అధికారిని ఈఓగా నియమించాల్సి ఉంది. సీనియార్టీ జాబితా, 888 జీఓతో పనిలేకుండా గ్రేడ్-1 ఈఓగా ఉన్న విశ్వనాథరాజుకు అడ్‌హాక్ ఏసీగా పదోన్నతి కల్పించారనే విమర్శలున్నాయి. ఈయనను కాకినాడ ఎంఎస్ఎన్ చారిటీస్ రెగ్యులర్ ఈఓగా బదిలీ చేశారు. అంతటితో ఆగకుండా పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం అదనపు బాధ్యతలు అప్పగించడమే కాకుండా డిప్యూటీ కమిషనర్ హోదా కలిగిన తలుపులమ్మ దేవస్థానం బాధ్యతలు కూడా ఆయన వద్దనే కొనసాగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ బదిలీల ప్రక్రియలో ఆంతర్యమేమిటనే చర్చ దేవదాయశాఖలో జోరుగా సాగుతోంది.



పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయం

వర్మపై జనసేన నేతల గుర్రు

పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయ ఈఓ దుర్గాభవానీకి పోస్టింగ్ మూడునాళ్ల ముచ్చటే అయ్యింది. ఇక్కడి ఈఓను మూడు నెలలు తిరగకుండానే ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి బదిలీ చేశారు. హఠాత్తుగా పిఠాపురం ఈఓను తప్పించి విశ్వనాథరాజుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తోన్న పిఠాపురం నియోజకవర్గ కేంద్రంలో ఉన్న కుక్కుటేశ్వరస్వామి ఆలయానికి ఈఓను జనసేన నేతలు సిఫారసుతోనే ఉన్నతాధికారులు నియమించారు. అటువంటి ఈఓను అకస్మాత్తుగా తప్పించి ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి బదిలీ చేయడంపై జనసేన నేతలు గుర్రుగా ఉన్నారు. దీని వెనుక మాజీ ఎమ్మెల్యే వర్మ సిఫారసు ఉందని జనసేన నేతలు మండిపడుతున్నారు. అసిస్టెంట్ కమిషనర్‌ల బదిలీల్లో కూడా డబ్బు చేతులు మారినట్టు చెప్పుకుంటున్నారు. పోస్టింగ్‌ను బట్టి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వెనకేసుకున్నారని సమాచారం. ముడుపుల్లో సగం వాటా ఇచ్చిన తరువాతే సంబంధిత ఆలయ పరిధిలోని ప్రజాప్రతినిధి సిఫారసు లేఖలు చేతిలో పెట్టారు. అవి తీసుకుని మిగిలిన సగం చేతికొచ్చాకనే బదిలీలకు పై స్థాయిలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కాగా, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 ఈఓల బదిలీల ప్రక్రియ ఆదివారంతో ముగిసింది. బదిలీల ప్రక్రియ ముగిసినా సోమవారం సాయంత్రం వరకు ఉత్తర్వులు విడుదల చేయకుండా బేరసారాలు నడిపినట్టు సమాచారం.

భారీగా ముడుపులు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గం వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి విశిష్టత ఉంది. ఇటీవల కాలంలో ఏడు వారాల వెంకన్నగా ఖండాంతర ఖ్యాతి ఆర్జించిన వాడపల్లి ఆలయంలో పోస్టింగ్ కోసం భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ పోస్టింగ్ కోసం కృష్ణాజిల్లా మోపిదేవి ఈఓ నల్లం చక్రధర్ ప్రయత్నించారు. గ్రేడ్-1 ఈఓగా ఉన్న మోపిదేవికి ఈఓ సీనియార్టీ జాబితా లేకుండా 888 జీఓతో పనిలేకుండా ఆరు నెలల క్రితం అడ్‌హాక్ ఏసీ హోదా కల్పించారు. ఆరు నెలలు తిరగకుండానే తాజా బదిలీల్లో మరో అడ్‌హాక్‌తో డీసీ పదోన్నతి ఇచ్చారని చెబుతున్నారు. ఏసీ అడ్‌హాక్ పైనే విమర్శలు రాగా ఇప్పుడు డీసీ అడ్‌హాక్ కూడా ఇవ్వడంతో దేవదాయశాఖ వర్గాలు నివ్వెరపోతున్నాయి. నిబంధనలు తుంగలోకి తొక్కి జరిపిన ఈ మొత్తం బదిలీ వ్యవహారం పశ్చిమ గోదావరిజిల్లాకు చెందిన మంత్రి కనుసన్నల్లో జరిగిందని సమాచారం. ప్రముఖ ఆలయాల బదిలీల్లో రూ.30 లక్షల నుంచి రూ.అరకోటికి పైనే చేతులు మారాయనే వార్త ఆ శాఖలో హల్‌చల్ చేస్తోంది.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఏలేరు వరద కారణంగా పడిన గండ్లను పరిశీలించి మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు

కొత్తపల్లి: ఏలేరు వరద కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని రైతు సంఘ జిల్లా కార్యదర్శి గురాల అప్పారెడ్డి అన్నారు. మండలంలోని ఏలేరు వరద ముంపు గ్రామాలైన కొత్త ఇసుకపల్లి, పాత ఇసుకపల్లిలలో సోమవారం రైతు సంఘం, కౌలు రైతు సంఘం సభ్యులు పర్యటించారు. కాలువకు పడిన గండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టాన్ని అంచనా వేయడంలో లోపాలున్నాయని, ఇప్పటి వరకూ ఈ-క్రాప్ నమోదు పూర్తి కాలేదన్నారు. దీంతో బీమా ప్రీమియం రైతుల తరపున ప్రభుత్వం చెల్లించిందో లేదో రైతులకు అర్థం కావడం లేదన్నారు. కాలువకు గండ్ల కారణంగా పొలాల్లో రెండు అడుగుల మేర ఇసుక మేటలు వేశాయని, వాటిని తొలగించాలంటే రైతుకు ఎకరానికి రూ.50 వేల ఖర్చు అవుతుందన్నారు. ఈ వరద కారణంగా మామిడి, కొబ్బరి రైతులు కూడా నష్టపోయారన్నారు. కౌలు రైతు సంఘ అధ్యక్షుడు రాజశేఖర్, వల్లు రాజబాబు, బండి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడా ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య అండర్-14, 17 జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి ఎల్.జార్జి సోమవారం తెలిపారు. కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో ఉదయం 8 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. 25న తైక్వాండో, ఆర్చరీ అండర్-14, 17, హాకీ, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్‌లో అండర్-14 బాలురు, బాలికల ఎంపికలు జరుగుతాయన్నారు. 26న బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, హాకీ అండర్-17, షూటింగ్, టెన్నికాయిట్ అండర్-14, 17 విభాగాలు, 27న అండర్-17 అథ్లెటిక్స్, మోడ్రన్ పెంటాథలాన్, యోగా అండర్-14, 17 విభాగాలు, 28న చెస్, వాలీబాల్, కబడ్డీలో అండర్-14, ఖో-ఖో అండర్-17 విభాగం, 29న వెయిట్ లిఫ్టింగ్ అండర్-14, 17 విభాగాలు, 29, 30న స్కేటింగ్ అండర్ 11, 14, 17 విభాగాల్లో ఎంపికలు ఉంటాయన్నారు. 30న కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ అండర్-17, అక్టోబర్ 1న అథ్లెటిక్స్ అండర్-14, సాఫ్ట్‌టెన్నిస్ అండర్-14, 17 బాలురు, బాలికల విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి ఈఈగా శంకరరావు

కాకినాడ రూరల్: కాకినాడ కాలుష్య నియంత్రణ మండలి (పొల్యూషన్ శాఖ) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎంబీఎస్ శంకరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన కాకినాడకు వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

న్యూస్‌రీల్

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

తుని: అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాలకు చెందిన ప్రతిభావంతులకు అవార్డులు అందజేస్తున్నామని సంస్థ జాతీయ కార్యదర్శి డాక్టర్ గణగ్ల విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ప్రతిభావంతులు వచ్చే నెల 2వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలన్నారు. విద్య, వైద్యం, సమాజసేవ, విధి నిర్వహణ, సాహిత్యం, నృత్యం, ఆధ్యాత్మికం, చిత్రలేఖనం, జనరల్ నాలెడ్జ్, క్రీడలు, శాస్త్రీయ సంగీతం (నాదస్వరం, డోలు, శాక్సోఫోన్), ఉపాధి కల్పన తదితర రంగాల్లో ప్రతిభ చూపిన వారికి ఆంధ్ర రత్న, తెలంగాణ రత్న, బాల రత్న, స్టేట్ బెస్ట్ సిటిజన్ రాష్ట్ర స్థాయి అవార్డులు ఇస్తామన్నారు. నేషనల్ బెస్ట్ సిటిజన్, విద్యారంగంలో విశేష కృషి చేసిన వారికి ప్రతిష్టాత్మక డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ పురస్కారం, శాస్త్రీయ నృత్యంలో ప్రతిభ చూపిన వారికి సిద్ధేంద్ర యోగి నాట్యకళా విశారద అవార్డులను ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ పూర్తి వివరాలతో 93913 79903 నంబరుకు వాట్సాప్‌లో వివరాలు పంపించాలని కోరారు. ఎంపికైన వారికి వచ్చే నెల 21న విజయవాడ హనుమాన్‌పేట ప్రెస్‌క్లబ్‌లో ఉన్నతాధికారులు, రాజకీయ, సినీ ప్రముఖులతో అవార్డులు ప్రదానం చేస్తామన్నారు.

కాకినాడ డీపీఓగా రవికుమార్

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా పంచాయతీ అధికారిగా (డీపీఓ) వి.రవికుమార్‌ను నియమించారు. ఇప్పటి వరకూ ఇక్కడ డీపీఓగా పనిచేసిన కె.భారతి సౌజన్య శ్రీకాకుళం బదిలీ అయ్యారు. గత ఏడాది నవంబర్ 8న ఇక్కడ బాధ్యతలు తీసుకుని ఏడాది పనిచేయకుండానే ఆమెను బదిలీ చేయడం విశేషం.

లోక కల్యాణార్థం శాంతి హోమం



అన్నవరం దేవస్థానంలో శాంతి హోమం పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరంలోని శ్రీవీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో లోక కల్యాణార్థం సోమవారం శాంతి హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకూ శాస్త్రోక్తంగా హోమం జరిగింది. అనంతరం హోమ గుండంలో ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. వన దుర్గమ్మ ఆలయం దిగువన ఉన్న హోమ మండపంలో పండితులు తొలుత విఘ్నేశ్వరపూజ, మండపారాధన చేశారు. అనంతరం ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠి, యనమండ్ర శర్మ, గంగాధరభట్ల గంగబాబు, ఉపాధ్యాయుల రమేష్, సత్యదేవుని ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, కల్యాణబ్రహ్మ ఛామర్తి కన్నబాబు, పురోహితుడు పాలంకి పట్టాభి, వన దుర్గ ఆలయ అర్చకులు కోట వంశీ తదితరులు హోమం తదితర పూజలు నిర్వహించారు. దేవస్థానం ఏఈఓ కృష్ణారావు, సూపరింటెండెంట్ కె.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి



ప్రజల సమస్యలు వింటున్న జేసీ రాహుల్ మీనా

కాకినాడ సిటీ: ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో డి.తిప్పేనాయక్, సీపీఓ పి.త్రినాథ్, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, డీపీఎం ఎస్డీసీ లావణ్యలు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై త్వరితగతిన సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలని అధికారులను జేసీ ఆదేశించారు. రెవెన్యూ, పింఛన్ల మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్లలో పూడిక తొలగింపు వంటి అంశాలకు సంబంధించి 534 అర్జీలు వచ్చాయి. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోపు పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి ఓటు వేశారని కక్ష సాధింపు



టీడీపీ కార్యకర్తల అరాచకాలపై జేసీ రాహుల్ మీనాకు వివరిస్తున్న ప్రజలు

కాకినాడ సిటీ: వైఎస్సార్ సీపీకి ఓటు వేశారంటూ టీడీపీ కార్యకర్తలు జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులను బెదిరింపులకు గురిచేస్తున్నారని మహిళలు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. శంఖవరం మండలం పాత వజ్రకూటం గ్రామంలోని ఇళ్లలోకి వెళ్లకుండా అడ్డంగా గేట్లు నిర్మించడం, ప్రహరీ కూల్చివేయడం, కుళాయిలు, కరెంటు లేకుండా టీడీపీ కార్యకర్తలు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో పట్టా పొంది ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులను ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని, వారి నుంచి తమ కుటుంబాలకు ప్రాణహాని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వజ్రకూటమి టీడీపీ కార్యకర్తలపై అన్నవరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు కూడా ఉన్నాయన్నారు. వారి దౌర్జన్యాలపై ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించాలని ఆందోళనకారులు కోరారు. ముఖ్యంగా పాత వజ్రకూటమి గ్రామానికి చెందిన కీర్తి వెంకట్రావు కుటుంబ సభ్యులను అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వీరు జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాను కలసి సమస్యను వివరించారు.

ఐసీడీఎస్ వ్యవస్థలో అదానీ ప్రవేశాన్ని అడ్డుకుంటాం



ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కాకినాడ సిటీ: అంగన్‌వాడీ కేంద్రాల్లో అదానీ సొంత వలంటీర్లను ప్రవేశపెట్టి ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, ఐసీడీఎస్ వ్యవస్థలో అదానీ ప్రవేశాన్ని అడుకుంటామని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి తెలిపారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు కార్యాలయంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ప్రవీణ్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అదానీ వలంటీర్ల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నామన్నారు. అదానీ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ ఫండ్స్ పేరుతో నేరుగా లబ్ధిదారులకు అందించే సహాయం, ఇతర సేవలను అదానీ వలంటీర్లు అంగన్‌వాడీ కేంద్రాల్లోని విధుల్లో కలగజేసుకుని పెత్తనం చెలాయించేందుకు సిద్ధపడుతున్నారని చంద్రావతి తెలిపారు. పేదలకు సీఎస్ఆర్ నిధులు ఖర్చు చేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఉండగా, అదానీ యాజమాన్యం నేరుగా ప్రభుత్వ కార్యకలాపాల్లో చొరబడటాన్ని మానుకోవాలని హెచ్చరించారు. దీనిపై పీడీ ప్రవీణకు వినతి పత్రం అందించామన్నారు. ఐసీడీఎస్ పీడీ ప్రవీణ్ స్పందిస్తూ అదాని యాజమాన్యంతో యూనియన్ నాయకులకు సమావేశం ఏర్పాటు చేసి అపోహలు తొలగిస్తామని వివరించారు. అంగన్‌వాడీ సిబ్బంది జ్యోతి, వీరమణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

అంతా గప్‌చుప్!



కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసిన ఉద్యోగ, సామాజిక న్యాయ సాధన సమితి ప్రతినిధులు

- ఎమ్మెల్యే నానాజీ కేసులో పోలీసుల దోబూచులాట
- కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గి వెనుకంజ
- ఎఫ్ఐఆర్ వేశాం-సెక్షన్‌లు చెప్పలేం
- నిందితుల పేర్లపై గోప్యత

సాక్షి ప్రతినిధి, కాకినాడ : కాకినాడ రంగరాయ వైద్య కళాశాల దళిత వైద్యుడు పి.ఉమామహేశ్వరరావుపై దాడి వ్యవహారంలో పోలీసులు దోబూచులాడుతున్నారు. కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ బూతులు తిడుతూ దాడికి పాల్పడ్డ కేసు విషయంలో పోలీసు యంత్రాంగం మొత్తం గప్‌చుప్‌గా వ్యవహరిస్తోంది. శనివారం రాత్రి ఆర్ఎంసీ గ్రౌండ్స్‌లో వాలీబాల్ కోర్టు విషయంలో తలెత్తిన వివాదంలో ఆర్ఎంసీ స్పోర్ట్స్ వైస్ చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వరరావుపై దౌర్జన్యానికి దిగిన ఎమ్మెల్యే నానాజీ, అతని అనుచరులపై ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, అదనపు డీఎంఈ నరసింహం కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, సర్పవరం సీఐ బొక్కా పెద్దిరాజుకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. వైద్యుడు ఉమామహేశ్వరరావును అసభ్య పదజాలంతో దూషించి, ఎమ్మెల్యే, అతని అనుచరులు కలిసి భౌతిక దాడికి పాల్పడ్డారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే కూటమి ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గిన జిల్లా పోలీసులు సోమవారం మధ్యాహ్నం వరకూ బాధ్యులపై ఎఫ్ఐఆర్ చేయకుండా కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారు. ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాల్సింది పోయి వైద్యుడు ఉమామహేశ్వరరావు ఫిర్యాదుచేస్తే కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు చెబుతూ వచ్చారు. కేసు నమోదులో పోలీసుల ఉదాసీనతపై దళిత, ప్రజాసంఘాల ఆందోళనలు, 'సాక్షి' వరుస కథనాలతో ఎట్టకేలకు దిగొచ్చిన పోలీసులు కాకినాడ సర్పవరం పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే పోలీసులు ఏయే సెక్షన్లు నమోదు చేశారు, ఎంత మందిపై కేసులు పెట్టారనే విషయంపై చాలా గోప్యత ప్రదర్శిస్తున్నారు. ఎక్కడైనా ఏదైనా చిన్న కేసు నమోదు చేస్తే హడావుడి చేసి ప్రచారం చేసుకునే పోలీసులు ఒక దళితుడిపై బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే నానాజీ దాడి చేసిన కేసు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైనా వివరాలు బయటకు రాకుండా దాగుడుమూతలు ఆడుతున్నారు. కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు, సర్పవరం సీఐ బొక్కా పెద్దిరాజు ఎఫ్ఐఆర్ వేశామని ముక్తసరి సమాధానంతోనే సరిపెట్టేశారు. కేసు విచారణలో ఉందని చెప్పుకొచ్చారు. స్వయంగా ఎమ్మెల్యే అనుచరులను వెంటేసుకుని బూతులు తిడుతూ వైద్యుడు ముఖానికి ఉన్న మాస్క్‌ను బలవంతంగా లాగేసి దాడికి పాల్పడ్డ వీడియో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనమైంది.



పంతం నానాజీ

మొక్కుబడి తంతు

ఎమ్మెల్యే, అనచరులు సాగించిన దౌర్జన్యం కళ్లకు కట్టినట్టు వీడియోలో చాలా స్పష్టంగా కనిపిస్తున్నా పోలీసులు కేసును మొక్కుబడి తంతు చేసేందుకు ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం, పోలీసులు పారదర్శకంగా ఉంటే గనుక వీడియోలో ఎమ్మెల్యే, అనుచరగణం సృష్టించిన రాద్ధాంతాన్ని చూసైనా పక్కాగా కేసులు నమోదు చేసేవారు. ఆ పని చేయడం లేదు. మొత్తం మీద ఈ కేసు వ్యవహారంలో జిల్లా యంత్రాంగం, పోలీసు యంత్రాంగం తీరు విమర్శలపాలైంది. కాగా, వైద్యుడిపై దాడి వ్యవహారంలో ఆరు సెక్షన్లతో కేసు నమోదు చేసినట్టు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తనను కలిసిన ఉద్యోగ సంఘాల నేతలకు తెలియచేశారు. కాగా, వైద్యుడిపై దౌర్జన్యం చేశారంటూ ఎమ్మెల్యే నానాజీ, దాడికి పాల్పడ్డారంటూ అతని అనుచరులపై సర్పవరం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

ధర ఘనం.. దిగుబడి హీనం



బత్తాయి చెట్లపై ఏర్పాటు చేసిన మైకు

సాక్షి, అమలాపురం: బత్తాయి రైతులకు కష్టమొచ్చింది. ఈ ఏడాది ధర ఆశాజనకంగా ఉన్నా.. దిగుబడి లేక ఆశించిన స్థాయిలో ఆదాయం పొందలేకపోతున్నారు. ఇదే సమయంలో వినాయక చవితి మార్కెట్ ఊపందుకున్న సమయంలో గోదావరి వరదల వల్ల కాయ కోత కోయలేకపోయారు. తోటల్లోకి దొంగలు వచ్చి పెద్ద ఎత్తున కాయలు కోసుకుపోయారు. ఇప్పుడు మిగిలిన కాయలనైనా రక్షించుకుందామంటే పక్షుల దాడి వారికి నిద్ర లేకుండా చేస్తోంది.

జిల్లాలో అయినవిల్లి, అంబాజీపేటతో పాటు అమలాపురం, కొత్తపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లో బత్తాయి సాగు జరుగుతోంది. మొత్తం సాగు 1,230.60 ఎకరాల్లో సాగు జరుగుతుండగా, ఒక్క అయినవిల్లి మండలంలోనే 985.53 ఎకరాల్లో సాగవుతోంది. కొబ్బరిలో అంతర పంటగా సాగు చేసి రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి అనుకున్న స్థాయిలో లేదు. చెట్టుకు వచ్చి సగటున 1,800 కాయల వరకు దిగుబడిగా వస్తోంది. ఒక్కోసారి రికార్డు స్థాయిలో 2,500 నుంచి 3 వేల వరకు కాయలు దిగుబడిగా వచ్చిన సందర్భాలున్నాయి. కానీ ఈసారి 1,200 కాయల దిగుబడి కూడా రాలేదు. ఈ కారణంగా మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉంది. పెద్ద కాయ ధర రైతు వద్ద రూ.14 వరకు పలుకుతోంది. దిగుబడి తగ్గినా ధర ఆశాజనకంగా ఉండడంతో ఎంతో కొంత ఆదాయం వస్తోందని రైతులు ఆశించారు. కానీ వినాయక చవితి పండగ సీజన్ మొదలు కాగానే గోదావరికి వరదలు రావడంతో నష్టాలను మిగిల్చింది. పండగ రెండు రోజుల నుంచి మొదలైన వరదతో తోటలు నీట మునిగాయి. పంట అధికంగా పండే అయినవిల్లి మండలంలోని వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, కొండుకుదురులంక, పొట్టిలంక, కపిలేశ్వరపురం మండలం అద్దంకివారి లంకల్లోని తోటల్లో ఆరు అడుగులపైనే తోటలు వరద నీటిలో రావడంతో రైతులు సీజన్‌లో బత్తాయి కోత కోయలేకపోయారు. ఈ సమయంలో కొందరు చోరులు రైతుల తోటల్లో ప్రవేశించి కాయను దొంగచాటుగా కోసుకుపోవడంతో రైతులు అవాక్కయ్యారు. 'కాయ ధర బాగుందనే సంతోషం లేదు మాకు. వరదల్లో మేము కోయలేకపోయాము. బయటవారు కోసుకుపోవడంతో మా ఆదాయానికి గండి పడింది. ఇప్పుడు ధర ఉన్నా చెట్ల మీద పెద్దగా కాయ లేదు' అని వీరవల్లిపాలేనికి చెందిన రైతు సలాది బుచ్చిరాజు 'సాక్షి' వద్ద వాపోయారు.

పంటను రక్షించుకునేందుకు..

పక్షుల దాడి ఈ ఏడాది చాలా ఎక్కువగా ఉంది. వడ్రంగి పిట్ట ఒక్కోసారి చెట్టు మీద వాలితే నాలుగైదు పండ్లను ధ్వంసం చేస్తాయి. వీటిని రాకుండా చేసేందుకు మైకులు ఏర్పాటు చేసుకున్నాను. రోజూ ఉదయం, మధ్యాహ్న సమయంలో రెండుసార్లు బ్యాటరీ మార్చడం, వివిధ రకాల అరుపులుతో మిమిక్రీ చేస్తున్నాను. ఈ విధానం వల్ల పంట చాలా వరకు రక్షించుకున్నాను. లేకుంటే చాలా నష్టాన్ని చవిచూడాల్సి వచ్చేది.

– సత్యనారాయణ, రైతు, గంగలకుర్రు, అంబాజీపేట మండలం

క్లుప్తంగా

కాలువలో పడి వ్యక్తి మృతి


బాలరాజు

తాళ్లరేవు: మండలంలోని కోరంగి పంచాయతీ పాత కోరంగి గ్రామానికి చెందిన బత్తుల బాలరాజు (45) ప్రమాదవశాత్తూ కాలువలో పడి మృతి చెందాడు. సోమవారం బాలరాజు కుటుంబసభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు బాలరాజు పశువులను మేపుతూ గ్రామ చెంతనే ఉన్న కాలువలో కాళ్లు కడుక్కునేందుకు దిగాడు. ఆ సమయంలో అకస్మాత్తుగా అతనికి గుండెపోటు రావడంతో అదుపుతప్పి పడిపోయి ఊబిలో కూరుకుపోయాడు. అది గమనించిన స్థానికులు అతన్ని పైకి తీసేందుకు ప్రయత్నించే లోపే బాలరాజు మృతి చెందినట్లు గుర్తించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే బతుకుదెరువు కోసం ఇటీవలే కువైట్ వెళ్లిన భార్య మంగ హుటాహుటిన బయలుదేరినట్లు తెలిసింది. ఈ సంఘటనతో పాతకోరంగి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎక్కడా చిరుత కదలికలు రికార్డు కాలేదు


రిజర్వ్ ఫారెస్ట్‌లో ట్రాప్ కెమెరాలను అమరుస్తున్న అటవీ సిబ్బంది

రాజానగరం: లాలాచెరువు, దివాన్‌చెరువు రిజర్వ్ ఫారెస్ట్ పరిసరాల్లో సంచరిస్తున్న చిరుతపులి కదలికలకు సంబంధించి గత మూడు రోజులుగా ఎటువంటి ఆధారాలు లభించలేదని, వివిధ చోట్ల తాము అమర్చిన ట్రాప్ కెమెరా, సీసీ కెమెరా ఏ ఒక్కదానిలో కూడా కదలికలు రికార్డు కాలేదన్నారు. అలాగే ఆయా పరిసరాల్లో తాము చిరుతపులిని చూశామనే విధంగా స్థానికుల నుంచి కూడా ఎటువంటి సమాచారం, ఫిర్యాదులు అందలేదన్నారు. అయినప్పటికీ చిరుతపులిని బంధించడానికి తమ సిబ్బంది నిరంతర నిఘా కొనసాగిస్తూనే ఉన్నారన్నారు. ట్రాప్ కెమెరాలను వంద నుంచి 105కి పెంచామని, 10 చోట్ల సీసీ టీవీ కెమెరాలను అమర్చి, ఏడు ప్రాంతాల్లో ట్రాప్ కేజ్ (ఇనుప బోను)లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఎటువంటి భయాందోళనకు గురికావొద్దని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఏ విధమైన సమాచారం తెలిసినా వెంటనే తమకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

తెలుసుకుందాం.. తేరుకుందాం

- కాకినాడ జీజీహెచ్‌లో ఉచిత సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు
- పీఐఎన్‌సీసీ, జీజీహెచ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహణ
- 21 నుంచి 60 ఏళ్ల లోపు మహిళలకే ముప్పు
- 26వ తేదీ వరకూ అవకాశం


స్క్రీనింగ్ పరీక్షలకు హాజరైన మహిళలు, యువతులు


కలెక్టర్ షన్‌మోహన్‌తో అమెరికాకు చెందిన పింక్ ఎన్జీవో వైద్య బృందం

కాకినాడ క్రైం: క్యాన్సర్.. ప్రమాదకరమే.. ముందస్తుగా తెలుసుకుంటే నివారణ సాధ్యమే. అందుకే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్)ను ముందస్తుగా గుర్తించేందుకు జీజీహెచ్ బృందం అమెరికా డాక్టర్లతో కలసి ముందుకొచ్చింది. తాజా గణాంకాల ప్రకారం క్యాన్సర్‌తో మృతి చెందుతున్న మహిళల్లో సర్వైకల్ క్యాన్సర్ బారిన పడిన వారే అధికం. ఈ నేపథ్యంలో వైద్య వర్గాలు అప్రమత్తమయ్యాయి. అనుబంధ ప్రభుత్వ, ప్రభుత్వేతర విభాగాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు నియంత్రణ, నివారణకు ముందుకు వస్తున్నారు. ఈ ప్రమాదం నుంచి మహిళలను బయటపడేసే అనేక శాస్త్రీయ విధానాలకు రూపకల్పన చేసి అమలు చేస్తున్నాయి. అందులో ఓ కీలక ప్రయత్నమే ఉచిత సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు. కాకినాడ జీజీహెచ్‌లో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, అంకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ వాసన్ సంయుక్త పర్యవేక్షణలో ఈ పరీక్షలు ప్రారంభమయ్యాయి.

×పింక్१ సౌజన్యంతో..

కాకినాడ జీజీహెచ్ గైనకాలజీ, అంకాలజీ విభాగాలతో పాటు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం పాటు పడుతున్న అమెరికా స్థాపిత అంతర్జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ పింక్ (పీఐఎన్‌సీసీ- ప్రివెంటింగ్ సర్వైకల్ క్యాన్సర్ గ్లోబల్లీ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అమెరికా నుంచి జీజీహెచ్‌కు డాక్టర్ల బృందం

అమెరికాకు చెందిన భారత సంతతి ప్రఖ్యాత రొబొటిక్ సర్జన్, యూరో గైనకాలజిస్టు డాక్టర్ సమత కడియాల ఆధ్వర్యంలో ఏడుగురు సభ్యుల వైద్య బృందం ఈ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణకు కాకినాడ జీజీహెచ్‌కు చేరుకుంది. ఈ బృందం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వివిధ దేశాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ప్రాథమిక దశలోనే గుర్తించడంలో నిష్ణాతులు. వీరికి జీజీహెచ్ గైనకాలజీ, అంకాలజీ విభాగాల వైద్యులు పూర్తి సహాయ సహకారాలు అందించనున్నారు. అమెరికన్ బృందం పరీక్షలు నిర్వహించడంతో పాటు భవిష్యత్‌లో జీజీహెచ్ వైద్య బృందాలే పరీక్షలు నిర్వహించేలా శిక్షణనిస్తారు.

ఆ పరికరం మనకే...

పింక్ సంస్థ పూర్తి ఖర్చును భరిస్తూ పరీక్షలు నిర్వహిస్తోంది. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పరీక్షల నిర్వహణకు థర్మల్ అబిలేషన్ టెక్నిక్ అనే యంత్రాన్ని వినియోగిస్తారని అంకాలజిస్టు డాక్టర్ ప్రదీప్ అన్నారు. తొలి దశలో గుర్తించబడ్డ క్యాన్సర్ల(ఎర్లీ లీజన్స్)కు ఈ పరికరం ద్వారా చికిత్స చేసి కేవలం 30 సెకన్లలో తొలగిస్తారన్నారు. పరీక్షల అనంతరం పింక్ సంస్థ ఈ పరికరాన్ని జీజీహెచ్‌కు ఇవ్వనుందని ఈ యంత్రం ధర సుమారు రూ.3 లక్షలని ప్రదీప్ తెలిపారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం..

మహిళలు సర్వైకల్ క్యాన్సర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రాణాపాయానికి దారి తీస్తుందని గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దోనేపూడి విజయ తెలిపారు. హెచ్‌పీవీ వైరస్ వల్ల ఈ వ్యాధి సోకుతుందని, అది ఒక లైంగిక సంక్రమణ వైరస్ అని అన్నారు. తొలి దశలోనే గుర్తిస్తే నూటికి నూరుపాళ్లు ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చని తెలిపారు.

రిజిస్ట్రేషన్ ఇలా...

సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల నిర్వహణకు ప్రత్యేక రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంది. ఆసుపత్రిలోని ఎస్ఆర్ఎంటీ బ్లాక్‌లో ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు ఈ స్క్రీనింగ్ పరీక్షలు కొనసాగుతుండగా, సమీపంలోనే ఆఫ్ లైన్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.

అలాగే టెలిఫోనిక్ రిజిస్ట్రేషన్, ఈ మెయిల్ రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించారు. రిజిస్ట్రేషన్ కోసం డాక్టర్ రాణి నీలిమను 88852 53889లో సంప్రదించాలనీ, ఆర్‌వోఆర్ఎంసీకేకేడీ(ఎట్‌ద రేట్)జీమెయిల్.కామ్ ద్వారా ఈ మెయిల్‌లో నమోదు చేసుకోవాలని గైనకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సూర్యకుమారి వెల్లడించారు. ఈ నెల 26వ తేదీ వరకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. 21 కంటే తక్కువ వయసులో వివాహమై మూడేళ్లు దాటితే పరీక్షలు చేయించుకోవాలి. హెచ్‌వోడీ అనురాగమయి ఆధ్వర్యంలో డాక్టర్ ఉషశ్రీ, డాక్టర్ విజయ, డాక్టర్ రుక్మిణీల బృందం ఈ పరీక్షల నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తోంది. పింక్ బృందం సేవలు జీజీహెచ్‌కు అందేలా చొరవ చూపిన డాక్టర్ వాసన్‌కు అభినందనలు.

– డాక్టర్ లావణ్యకుమారి, సూపరింటెండెంట్, జీజీహెచ్

గుర్తించిన వెంటనే చికిత్స



స్క్రీనింగ్ పరీక్షల్లో తొలి దశ క్యాన్సర్‌ను గుర్తిస్తే థర్మల్ అబిలేషన్ టెక్నిక్ యంత్రాన్ని వినియోగించి తక్షణమే తొలగిస్తారు. రాష్ట్రంలో గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ కేసులు అధికంగా ఉన్నాయి. మహిళలు అప్రమత్తంగా ఉండాలి. పరీక్షల్లో క్యాన్సర్‌ను గుర్తిస్తే దశను అనుసరించి గైనకాలజీ, అంకాలజీ నిపుణులు చికిత్స అందిస్తారు. డాక్టర్ సమత ఆధ్వర్యంలో పింక్ బృందానికి అభినందనలు.

– డాక్టర్ శ్రీనివాసన్, హెచ్‌వోడీ, అంకాలజీ

పంచాయతీరాజ్ వ్యవస్థపై అవగాహన ఉండాలి


పలు జిల్లాల్లోని మండల స్థాయి అధికారుల శిక్షణలో మాట్లాడుతున్న కృష్ణమోహన్

సామర్లకోట: పంచాయతీరాజ్ అధికారులు, విధులపై మండల స్థాయి అధికారులకు అవగాహన ఉండాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్ అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీ, సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణను సోమవారం ఆయన ప్రారంభించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ పంచాయతీ అధికారుల విధులను స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇవ్వడానికి మండల స్థాయి అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. పంచాయతీ అధికారులు, తెలుసుకున్న సమయంలో ప్రజా ప్రతినిధులు పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ సమావేశాల్లో మాట్లాడే విధానంపై అవగాహన ఉంటుందన్నారు. జిల్లా పరిషత్ పాలక మండలికి చట్టపరమైన హోదా ఉంటుందని తెలిపారు. పంచాయతీ రాజ్ చట్టం 1994పై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలని చెప్పారు. ఆయా మండలాలలో 100 శాతం ఎస్టీలు ఉన్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. పరిపాలనా వికేంద్రీకరణలో భాగంగా వనరుల పంపిణీ సక్రమంగా జరగాలన్నారు. ప్రభుత్వ పనుల్లో స్థానికులను భాగస్వాములను చేయాలన్నారు. గ్రామీణ ప్రజల దైనందిన అవసరాలను మేలైన పద్ధతిలో తీర్చాలన్నారు. ఫ్యాకల్టీలు పి.శ్రీనివాసరావు, కేఆర్ నిహారిక, పద్మజ, వి.ప్రసాద్, ఎం.చక్రపాణిరావు, రీసోర్స్‌పర్సన్ శ్రీనివాసులు శిక్షణ ఇచ్చారు.

చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి


సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల జట్లు

మంత్రి సుభాష్

రామచంద్రపురం: నేటితరం పిల్లలు చదువుతో పాటు క్రీడలకూ సమయం కేటాయించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-13 బాస్కెట్‌బాల్ సబ్ జూనియర్ బాలుర, బాలికల చాంపియన్ షిప్ పోటీలను మంత్రి సుభాష్ ప్రారంభించారు.

ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, చాంపియన్ షిప్ నిర్వాహకుడు చక్రవర్తి మాట్లాడుతూ.. రామచంద్రపురం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గరిగిపాటి జానకిరామయ్య జ్ఞాపకార్థం ఈ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 14 బాలుర టీంలు, 8 బాలికల టీంలు ఈ పోటీల్లో తలపడతాయన్నారు. వీరిలో మంచి ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులను గుర్తించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి జట్టుకు, అక్కడి నుంచి త్వరలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటుందన్నారు. పోటీలను ప్రారంభించిన మంత్రి సుభాష్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో ఆటలు కూడా అంతే ముఖ్యమని అన్నారు. నేటి తరం పిల్లలకు సరైన శారీరక శ్రమ లేక చిన్న వయసులోనే బీపీ, సుగర్ వంటి రోగాల బారిన పడుతున్నారన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కౌన్సిలర్ తోట అమ్మాజీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ పట్టణ ఇన్‌చార్జ్ కె.రాఘవన్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మ

కాకినాడ క్రైం: ఆ యువకుడి అవయవ దానంతో ముగ్గురికి పునర్జన్మ లభించింది. పశ్చిమగోదావరి జిల్లా తోకలపూడి గ్రామానికి చెందిన పోలిశెట్టి రేవంత్ శ్రీ మురహరి (19) స్వగ్రామం నుంచి విశాఖపట్నానికి పరీక్ష రాసేందుకు ఈ నెల 21వ తేదీన బయలుదేరాడు. మార్గ మధ్యలో ఎర్రవరం హైవేపై రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కాకినాడ అపోలో ఆసుపత్రికి తరలించగా తగిన వైద్య సేవలు అందించినా తలకు తీవ్ర గాయం కావడంతో ఫలితం లేకపోయింది. బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో వైద్యులు డాక్టర్ ఎంవీ కిరణ్‌కుమార్, డాక్టర్ శివరామగాంధీ కుమారుడి పరిస్థితిని తండ్రి సుబ్రహ్మణ్యంకి వివరించి అవయవ దాన ప్రాధాన్యాన్ని వివరించారు. దీంతో సుబ్రహ్మణ్యం జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో తన కుమారుడి అవయవ దానానికి రిజిస్టర్ చేశారు. దీంతో రేవంత్ కిడ్నీని కాకినాడ అపోలో ఆసుపత్రికి, మరో కిడ్నీని విశాఖపట్టణం కేర్ ఆసుపత్రికి, కాలేయాన్ని షీలానగర్ అపోలో ఆసుపత్రికి తరలించి ముగ్గురి ప్రాణాలు కాపాడారు. ఇందుకు కాకినాడ అపోలోలో ఆర్గాన్ హార్వెస్టింగ్ నిర్వహించారు. జిల్లా పోలీస్ శాఖ సాయంతో సోమవారం గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి అవయవాలను సురక్షితంగా సకాలంలో తరలించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో సబ్‌రిజిస్ట్రార్ల నియామకం

కాకినాడ లీగల్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో ఉమ్మడి జిల్లా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లు బదిలీల కౌన్సెలింగ్ ఆదివారం జరిగింది. ఏలూరు డీఐజీ కార్యాలయంలో ఉమ్మడి జిల్లా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లకు ఏలూరు, విజయవాడ, కాకినాడ డీఐజీల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ చేపట్టి బదిలీలు నిర్వహించారు.

కాకినాడ జిల్లా పరిధిలో..

కాకినాడ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1 : ఆర్‌వీ రామారావు
కాకినాడ జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2: పీఎస్‌వీఎస్ఎస్ వీరభద్రరావు
జగ్గంపేట సబ్ రిజిస్ట్రార్: సీహెచ్ రమేష్‌బాబు
పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్: పి.విజయలక్ష్మి
ప్రత్తిపాడు సబ్‌రిజిస్ట్రార్: వీవీ డేనియల్
సామర్లకోట సబ్‌రిజిస్ట్రార్: బీవీవీ సత్యనారాయణ
పిఠాపురం సబ్‌రిజిస్ట్రార్: వి.రమాదేవి
తాళ్లరేవు సబ్‌రిజిస్ట్రార్: పి.శారద
తుని సబ్‌రిజిస్ట్రార్: టి.సుబ్బారెడ్డి
కాకినాడ డీఐజీ కార్యాలయ సబ్‌రిజిస్ట్రార్: ఆర్.శ్రీనివాసరావు
కాకినాడ మార్కెట్ అండ్ ఆడిట్ సబ్ రిజిస్ట్రార్: ఎ.శ్రీనివాస్
కాకినాడ చిట్ సబ్‌రిజిస్ట్రార్ : ఎ.సునందశ్రీ

తూర్పుగోదావరి జిల్లా పరిధిలో..

రాజమహేంద్రవరం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1: ఆర్.రాంబాబు
రాజమహేంద్రవరం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2: పుల్లంరాజు
బిక్కవోలు సబ్‌రిజిస్ట్రార్ : సీహెచ్ శ్రీనివాసబాబు
కడియం సబ్‌రిజిస్ట్రార్ : ఇ.లక్ష్మి
అనపర్తి సబ్‌రిజిస్ట్రార్ : కె.కమలప్రియ
పిడింగొయ్యి సబ్‌రిజిస్ట్రార్ : త్రినాథ్
రాజానగరం సబ్‌రిజిస్ట్రార్: వి.వెంకటేశ్వర్లు
కోరుకొండ సబ్‌రిజిస్ట్రార్ : వీవీఎస్‌బీ శ్రీనివాస్
సీతానగరం సబ్‌రిజిస్ట్రార్ : ఐహెచ్‌ఆర్‌కే ప్రసాద్
అనంతపల్లి సబ్‌రిజిస్ట్రార్: ఇ.వెంకటేశ్వరరావు
కొవ్వూరు సబ్‌రిజిస్ట్రార్ : కె.సుందరరావు
నిడదవోలు సబ్‌రిజిస్ట్రార్ : ఎం.రాజబాబు
వేగేశ్వరపురం సబ్‌రిజిస్ట్రార్ : మోహన్

కోనసీమ జిల్లా పరిధిలో..

అమలాపురం జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1: ఆర్.శ్రీలక్ష్మి
అమలాపురం జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2: లక్ష్మణ్‌రాజు
ముమ్మిడివరం సబ్‌రిజిస్ట్రార్: ఎం.సుధాకర్
రామచంద్రపురం సబ్‌రిజిస్ట్రార్: తోట శ్రీనివాస్
ఆలమూరు సబ్‌రిజిస్ట్రార్: కేవీఎస్ కుమారి
ద్రాక్షారామం సబ్‌రిజిస్ట్రార్: ఆర్.సత్యవతిరాణి
కొత్తపేట సబ్‌రిజిస్ట్రార్: ఎస్.శేఖర్‌బాబు
ఆత్రేయపురం సబ్‌రిజిస్ట్రార్: ఎం.రత్నకుమార్
రావులపాలెం సబ్‌రిజిస్ట్రార్: వి.సూర్యనారాయణ
అంబాజీపేట సబ్‌రిజిస్ట్రార్: యు.జగన్‌మోహన్‌రావు
రాజోలు సబ్‌రిజిస్ట్రార్: జి.రమ్యశ్రీ
మండపేట సబ్‌రిజిస్ట్రార్: షేక్ మౌలానా సాహెబ్
ఐ.పోలవరం సబ్‌రిజిస్ట్రార్: వి.భవాని నర్సమాంబ
అల్లవరం సబ్‌రిజిస్ట్రార్: సీహెచ్‌ఎస్ఎన్‌వీ సత్యనారాయణ
మలికిపురం సబ్‌రిజిస్ట్రార్: వి.వెంకటేశ్వరరావు
మామిడికుదురు సబ్‌రిజిస్ట్రార్: ఎంవీ మోహన్

గొడౌన్‌లో బియ్యం చోరీ: ఛేదించిన పోలీసులు


కాకినాడ కొండెలుపేట వద్ద స్వాధీనం చేసుకున్న బియ్యం, లారీ, అరెస్టు చేసిన నిందితులతో సర్పవరం పోలీసులు

- రూ.4.5 లక్షల విలువైన సరకు స్వాధీనం
- లారీ సీజ్

కాకినాడ రూరల్: రైస్ బ్యాగ్‌ల దొంగతనాలకు పాల్పడే ముగ్గురు ముఠా సభ్యులను సోమవారం అరెస్టు చేసినట్టు సర్పవరం సీఐ బి.పెద్దిరాజు తెలియజేశారు. ఆయన వివరాలు ప్రకారం ఈనెల 13న రాత్రి దుమ్ములపేట రైల్వే గేటు సమీపాన ఒక రైస్ గొడౌన్ నుంచి సుమారు 500 బ్యాగ్‌ల బియ్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తరలించుకుపోవడంతో బాధితుడు సర్పవరం పోలీసుస్టేషన్‌లో మరుసటి రోజున ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు డీఎస్పీ రఘువీర్ విష్ణు పర్యవేక్షణలో సర్పవరం సీఐ పెద్దిరాజు, సిబ్బంది, బృందాలుగా ఏర్పడి చోరీ కేసును ఛేదించేందుకు కృషి చేశారు. సోమవారం ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని కొండెలుపేట శివారులో అక్రమ బియ్యం నిల్వ ఉన్నట్టు తెలుసుకుని దాడి చేశారు. ఈ దాడిలో రూ.4.5 లక్షల విలువైన 500 బ్యాగ్‌లోని బియ్యం స్వాధీనం చేసుకుని అందుకు వినియోగించిన లారీని సీజ్ చేశారు. రైస్ దొంగతనానికి పాల్పడిన కాకినాడ డెయిరీ ఫామ్ సెంటర్‌కు చెందిన పట్నాల వంశీరెడ్డి, షేక్ అహ్మద్ అలీ, జగన్నాథపురం గోలీలపేటకు చెందిన అనసూరి దుర్గలను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైస్ బ్యాగ్‌ల చోరీ కేసును ఛేదించామని నిందితుల్లో పట్నాల వంశీరెడ్డిపై పోర్టు పీఎస్‌లో 12 కేసులు, షేక్ అహ్మద్ అలీపై ఆరు కేసులు, అనసూరి దుర్గాపై వన్ టౌన్ పీఎస్‌లో ఆరు కేసులు ఉన్నాయన్నారు. ముగ్గురు నిందితులపై సస్పెక్ట్ రౌడీ షీట్ ఉందన్నారు. కేసు ఛేదించేందుకు ఎస్సై రామకృష్ణమూర్తి, హెచ్‌సీలు సత్తిబాబు, రాజు, గణేష్, పీసీ వెంకటరత్నంలను ఎస్పీ అభినందించారని సీఐ తెలిపారు.

గిన్నిస్‌కెక్కిన జెస్సీ విల్సన్, హదస్సా


గిన్నిస్ రికార్డులో భాగస్వామి తల్లి జెస్సీ విల్సన్ (చిత్రంలో కుడి చివర), కూతురు హదస్సా (ఎడమ నుంచి రెండో వ్యక్తి)

పెదపూడి: ఊలు దారాలతో గ్రానీస్క్వేర్స్ (మహిళలు ధరించే ఊలు వస్త్రాలు)ను విశాఖ పట్టణానికి చెందిన మహిళా మనోవికాస్ సంస్థ తయారు చేస్తుంది. ఈ నేపథ్యంలో ఆ సంస్థ వ్యవస్థాపకురాలు సూరిభట్ల మాధవి ఆధ్వర్యంలో 400 మంది గృహిణులు కలసి ఒక బృందంగా ఆరు నెలల్లో 58,112 గ్రానీ స్క్వేర్‌లను తయారు చేశారు. గత ఆదివారం విశాఖ పట్నంలో నిర్వహించిన అతి పెద్ద గ్రానీ స్క్వేర్స్ ప్రదర్శనలో ఉంచగా వాటిని పరిశీలించిన గిన్నిస్ ప్రతినిధులు ×లార్జెస్ట్ డిస్‌ప్లే క్రోచెట్ గ్రానీస్క్వేర్స్१గా ధ్రువీకరణ పత్రం అందించారు. ఈ బృందంలో పెదపూడి మండలం చింతపల్లి లాకుకు చెందిన జుత్తక జెస్సీ విల్సన్, ఆమె కుమార్తె హదస్సా సభ్యులు. దీంతో వారు కూడా గిన్నిస్ రికార్డులో భాగమయ్యారు. ఈ రికార్డు జెస్సీ విల్సన్‌కు రెండోసారి కాగా, ఆమె కుమార్తె హదస్సాకు మొదటిసారి. గిన్నిస్ రికార్డులో వీరిరువురు భాగస్వాములు కావడంతో వారికి పలువురు అభినందనలు తెలిపారు.

మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్య

చాగల్లు: మండలంలో చిక్కాలలో మనస్థాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై కె.నరేంద్ర తెలిపారు. గ్రామానికి చెందిన సంసాని గంగరాజు (43)కు అదే గ్రామానికి చెందిన పెదపాటి పండుకి గ్రామంలో ప్రాథమిక పాఠశాల వద్ద రోడ్డుపై ఘర్షణ చోటు చేసుకుంది. ఈ సమయంలో గంగరాజును పండు చంపుతానని బెదిరించాడు. అనంతరం ఈ ఘటనతో తీవ్ర మనస్థాపానికి గురైన గంగరాజు తన ఇంటికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. గంగరాజు భార్య కోట సత్యవతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతదేహానికి నిడదవోలు ప్రభుత్వ ఆస్పత్రిలో పంచనామా నిర్వహించారు. గంగరాజు మృతి నేపథ్యంలో గ్రామంలో ఎటువంటి ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకోకుండా కొవ్వూరు రూరల్ సీఐ కె.విజయబాబు ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలో బందోబస్తు నిర్వహించారు. పరిస్థితిని జిల్లా ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు చిక్కాల వచ్చి పరిశీలించారు.

పలువురు ఈవోల బదిలీ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సాధారణ బదిలీల్లో భాగంగా దేవదాయ శాఖలో పని చేస్తున్న పలువురు ఈవోలను, డీసీ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బంది బదిలీ అయ్యారు. కాకినాడ బాలాత్రిపుర సుందరి ఆలయ ఈవో విజయభాస్కర్‌రెడ్డిని కాకినాడలోని బంగారు చిన్న శోభనాద్రి సత్రం ఈఓగా నియమించారు. ఆయన స్థానంలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా చింతలూరు నూకాలమ్మ దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న ఉండవల్లి వీర్రాజుచౌదరిని నియమించారు. పిఠాపురం శ్రీపాద శ్రీవల్లభ సంస్థానం ఈవోగా పనిచేస్తున్న సౌజన్యకు అదనంగా కాండ్రకోట నూకాలమ్మ దేవస్థానం ఈవోగా బాధ్యతలు అప్పగించారు. ఇక్కడ పని చేస్తున్న సూర్యనారాయణను కరకుదురు ఈవోగా నియమించారు. వేలంగి గ్రూపు దేవస్థానాల ఈఓగా పనిచేస్తున్న ఎం.మురళీ వీరభద్రరావును కాకినాడ పెద్ద మార్కెట్ నూకాలమ్మ దేవస్థానం ఈవోగా నియమించారు. కాకినాడ జగన్నాథపురం పార్థసారథి దేవాలయం ఈవోగా పనిచేస్తున్న వడ్డాది సత్యనారాయణను బదిలీ చేశారు. ఆయన స్థానంలో ముమ్మిడివరంలో పనిచేస్తున్న పీకే లక్ష్మణరావును నియమించారు. కాకినాడ గాంధీనగర్ వేంకటేశ్వర స్వామి ఆలయ ఈవోగా చిత్తావజ్జల శ్రీనివాస నాగసుబ్రహ్మణ్యంను నియమించారు. కోటిపల్లి ఈవోగా పనిచేస్తున్న ఎం.శ్రీదేవిని కాకినాడ పైడా చలమయ్య కల్యాణమండపం ఈవోగా నియమించారు. కాకినాడ గ్రూపు దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న రమణను కడియం గ్రూపు దేవస్థానంకు బదిలీ చేశారు. కాకినాడ డిప్యూటీ కమిషనర్ కార్యాలయ సూపరింటెండెంట్ కె.నాగేశ్వరరావును తూర్పుగోదావరి జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్‌గా నియమించారు. మరో సూపరింటెండెంట్ తోట సుబ్రహ్మణ్యంను రాజమహేంద్రవరం రీజినల్ జాయింట్ కమిషనర్ కార్యాలయం సూపరింటెండెంట్‌గా నియమించారు. అక్కడ పనిచేస్తున్న సూపరింటెండెంట్ కృష్ణకుమారిని కాకినాడ డిప్యూటీ కమిషనర్ కార్యాలయనికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. తూర్పుగోదావరి జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న సోమరాజును కాకినాడ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు .మురముళ్ల గ్రూపు దేవస్థానంల ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణను కాకినాడ సర్పవరం భావనారాయణ స్వామి ఆలయ ఈఓగా నియమించారు. కాకినాడ డీసీ కార్యాలయంలో పని చేస్తున్న అపర్ణను పెనుగుదురు గ్రూపు దేవస్థానాల ఈఓగా నియమించారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి


మృతి చెందిన ఆదిలక్ష్మి, సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ చెన్నకేశవరావు, ఎస్సై కృష్ణామాచారి

తుని రూరల్: తుని మండలం తేటగుంట శివారు ఎర్రకోనేరు జంక్షన్‌లో సోమవారం 16వ నంబర్ జాతీయ రహదారిపై లారీ బైక్‌ను ఢీకొంది. ప్రమాద విషయం తెలియడంతో రూరల్ సీసీ చెన్నకేశవరావు, రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రూరల్ ఎస్సై తెలిపిన వివరాలిలా.. గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన పిల్లి పెదకాపు తన భార్య ఆదిలక్ష్మితో కలసి బైక్‌పై తునిలో బంధువులను పరామర్శించడానికి వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి బయలుదేరిన వారు ఎర్రకోనేరు జంక్షన్‌కు చేరుకున్నారు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన లారీ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో కిందపడిన ఆదిలక్ష్మి(55) తలకు బలమైన గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త పెదకాపు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో తుని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రుడి సోదరుడు పిల్లి వెంకట్రావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

పిడుగుపడి రైతు మృతి

రంగంపేట: మండలంలోని వడిశలేరులో మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం కారణంగా పిడుగుపాటుకు గురై రైతు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వైట్ల నరేంద్ర రాంబాబు (45) ఏడీబీ రోడ్డు పక్కన ఉన్న తన పొలానికి వెళ్లాడని పొలంలో ఉండగానే భారీ వర్షం కురవడంతో అక్కడే చెట్టు కింద ఉన్న ఇనుప బల్లపై కూర్చుండగా ఒక్కసారిగా పిడుగు పడటంతో నరేంద్ర రాంబాబు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు. ఈ ప్రమాదంలో మృతుడి వీపు భాగం కాలిపోయిందన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.